
నమస్తే తెలంగాణ



# ఉల్లంఘనులు
# పెండింగ్‌లో చలాన్లు




నిజామాబాద్ క్రైం, డిసెంబర్ 17:

రోడ్లపై ఇష్టారీతిన వాహనాలు నడిపే వారిని ఇక ఉపేక్షించకూడదని పోలీసులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నా, కొందరిలో ఎలాంటి మార్పు కనిపించడం లేదు. వాళ్లు చేసిన తప్పుకు అమాయక వాహనదారులు, మరొకరు ప్రమాదాలకు గురికావాల్సి వస్తున్నది. ఈ క్రమంలో కుర్రకారు స్పీడ్‌కు హద్దు లేకుండా పోతున్నది. మరికొంత మంది కనీస నిబంధనలు తుంగలోకి తొక్కి వాహనాలతో రోడ్లపైకి వస్తున్నారు. ఇలాంటి వారిపై పోలీసులు ఎక్కడికక్కడ కేసులు నమోదు చేసి చలాన్లు కూడా విధిస్తున్నారు. ఇంతవరకు బాగానే ఉన్నా మళ్లీ షరా మామూలుగానే వ్యవహరించడం గమనార్హం. జరిమానాలు వేసిన తర్వాత చాలా మంది వాటిని చెల్లించడం లేదు. తిరిగి యథావిధిగా రోడ్లపైకి వచ్చి నిబంధనలు అతిక్రమిస్తూనే ఉన్నారు. దీంతో ఒక్కో వాహనంపై భారీగా పెండింగ్ చలాన్లు పేరుకుపోతున్నాయి. దీంతో పేరుకుపోయిన చలనాలు వసూలు చేయడంతో పాటు నిబంధనలు అతిక్రమిస్తున్న వారిపై చర్యలు చేపట్టేందుకు పోలీసులు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నారు.



- నిబంధనలు తుంగలో తొక్కుతున్న వాహనదారులు
- రోజుకు 200-300 మందికి జరిమానాలు
- ఈ చలాన్లు పంపిస్తున్న పోలీసులు
- సుమారు రూ.10లక్షల 'ఈ-చలాన్ల' పెండింగ్

## జరిమానాలు చెల్లించేలా చర్యలు..

వాహనదారులు రూల్స్ బ్రేక్ చేసిన ప్రతిసారీ పోలీసులు చలాన్ విధిస్తున్నారు. పోలీసులు ఫైన్ విధించిన వెంటనే సదరు వాహన యజమాని ఫోన్‌కు మెస్సేజ్ వెళ్తుంది. చాలా మంది వాహనదారులు ఫైన్ పడిన వెంటనే చెల్లించకుండా జాప్యం చేస్తున్నారు. ఇలా ఒక్కో వాహదారుడికి 4 నుంచి 5లేదా అంతకన్నా ఎక్కువ ఈ చలాన్లకు సంబంధించి సుమారు రూ.2వేల నుంచి రూ.4వేల వరకు బకాయి ఉన్నట్లు పోలీసుల తనిఖీల్లో వెల్లడవుతున్నది. పెద్దమొత్తంలో బకాయి ఉన్న వాహనదారుడు మళ్లీ నిబంధనలు పాటించకుండా పట్టుబడితే జరిమానా డబ్బులు మొత్తం చెల్లించేలా చర్యలు తీసుకుంటున్నారు.

## పెండింగ్ చలాన్లు @ రూ.10లక్షలు

ఈ ఏడాది మూడు నెలల వ్యవధిలో విధించిన ఈ చలాన్లలో 9వేల మంది సుమారు రూ.6లక్షల వరకు చెల్లించినట్లు అధికారులు తెలిపారు. పెండింగ్ చలాన్ల రూపంలో వచ్చే ఆదాయం సుమారు రూ.10లక్షల వరకు ఉండే అవకాశం ఉన్నది. వీరిని గుర్తించి జరిమానా కట్టించేందుకు ట్రాఫిక్ పోలీసులు తీవ్రంగా కృషి చేస్తున్నారు.

## రోజుకు 200-300 జరిమానాలు..

ట్రాఫిక్ పోలీసులు నిత్యం నిర్వహిస్తున్న స్పెషల్ డ్రైవ్‌లో నిబంధనలు పాటించని వాహనదారులకు చలాన్ విధిస్తున్నారు. ఇలా ప్రతి రోజు సగటున 200-300 మంది వాహనదారులకు జరిమానా వేస్తున్నారు. గత 70 రోజుల వ్యవధిలోనే సుమారు 25వేల ఈ చలాన్లు విధించినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇందులో కేవలం 9వేల మంది జరిమానాలు చెల్లించగా, మిగతా 16వేల మంది ఫైన్ చెల్లించాల్సి ఉన్నట్లు తెలిసింది.

## అవగాహన కల్పించినా.. ఆచరణ నామమాత్రం..

నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో ప్రతి వాహనదారుడు ఆర్టీఏ, ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సంబంధిత శాఖల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహించినా ఎలాంటి ప్రయోజనం లేకుండా పోతుంది. కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్లలోని పోలీస్ స్టేషన్ల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు నిర్వహిస్తూ వస్తున్నారు. ట్రాఫిక్, సివిల్ పోలీసులు సైతం వాహనాల తనిఖీ చేపడుతూ జరిమానా విధిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన కూడళ్లు, రద్దీ ప్రదేశాల్లో సీట్ బెల్టు పెట్టుకొని ఫోర్ వీలర్ డ్రైవర్లతోపాటు హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనం నడుపుతున్న వారికి, ట్రిపుల్ రైడింగ్, రాంగ్‌రూట్, ధ్రువపత్రాలు లేని, ఆర్టీఏ నిబంధనలు పాటించని వారికి ఈ చలాన్ విధిస్తున్నారు. ట్రాఫిక్ పోలీసులే రోజూ ఉదయం నుంచి రాత్రి వరకు వందలాదిగా ఈ చలాన్లు విధిస్తున్నారంటే వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను ఎంత మేరకు ఉల్లంఘిస్తున్నారో తెలుస్తున్నది.



చెల్లించిన చలాన్లను చూపుతున్న వాహనదారుడు

---

# చలికాలం.. చన్నీటి స్నానం

- పట్టించుకోని అధికారులు • ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు

కోటగిరి, డిసెంబర్ 17: విద్యార్థుల క్షేమం కోసం అన్ని వసతులు కల్పించి ప్రభుత్వ సంక్షేమ భవనాల్లో వారి బాగోగులకు కృషి చేస్తున్నది. క్షేత్రస్థాయిలో మాత్రం పరిస్థితి మరోలా ఉంటున్నది. అధికారులు చెబుతున్న మాటలకు, చేతలకు పొంతన ఉండడం లేదు. అసలే చలికాలం, అపై చన్నీటితో స్నానంతో విద్యార్థినులు నానా అవస్థలు పడుతున్నారు. ఇది కోటగిరి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలోని వసతిగృహ పరిస్థితి. ఇక్కడ ఏర్పాటు చేసిన సోలార్ వేడినీటి యంత్రం మరమ్మతులకు గురవ్వడంతో చన్నీటి స్నానాలే విద్యార్థినులకు దిక్కయ్యాయి. తప్పనిస్థితిలో బోరు బావి నుంచి వస్తున్న నీటిని ట్యాంకులో నిల్వ చేసుకొని అదే చన్నీటి నీటితో స్నానాలు చేస్తున్నారు. ఎవరికి చెప్పుకోవాలో తెలియని స్థితిలో ఇబ్బంది పడుతున్నారు. ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాల్సిన సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని వారు వాపోతున్నారు.

## పనిచేయని సోలార్ వేడి నీటి యంత్రాలు

కోటగిరి మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో సోలార్ వేడినీటి యంత్రాలు ఏర్పాటు చేశారు. అవి మరమ్మతులకు గురయ్యాయి. వాస్తవానికి రాష్ట్రంలో గత సంవత్సరం నుంచి అన్ని వసతి గృహాల్లో విద్యార్థుల స్నానానికి వేడి నీటిని అందించాలనే సూచనలు ఉన్నప్పటికీ ఇక్కడ మాత్రం యంత్రాలు పనిచయడం లేదనే నెపంతో సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థినుల తల్లిదండ్రులు వాపోతున్నారు.

తప్పనిసరి పరిస్థితుల్లో విద్యార్థినులు చన్నీటి స్నానాలు చేసి అనారోగ్యానికి గురవుతున్నారు.



కోటగిరి కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలపైన పని చేయని సోలార్ వేడినీటి యంత్రాలు

## చాలా ఇబ్బందిగా ఉన్నది..

చలి బాగా పెరిగింది. పొద్దునే చల్లని నీటితో స్నానం చేయాలంటే భయమేస్తున్నది. స్నానం చేసిన అనంతరం గజగజ వణుకుతున్నాం. ఉపాధ్యాయులకు పలుమార్లు అడిగినా ఉన్నతాధికారులకు చెప్పాం. యంత్రాలు పని చేయడం లేదు ఏం చేస్తామంటూ సమాధానం చెబుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి వేడినీటి యంత్రాలను వినియోగంలోకి తీసుకురావాలి.

**-విద్యార్థిని, కోటగిరి**

## ఉన్నతాధికారులకు నివేదించాం..

కోటగిరి కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాలలో వేడి నీటి యంత్రాలు పనిచేయకపోవడంతో విద్యార్థులు చన్నీటి స్నానాలు చేసి ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేశాం. అనారోగ్యం బారినపడిన విద్యార్థులకు తప్పనిసరి పరిస్థితి ఉంటే కొంత నీటిని గ్యాస్‌పై వేడి చేసి ఇస్తున్నాం.

**- సవిత, ప్రత్యేకాధికారిణి, కేజీబీవీ కోటగిరి**